క్లుప్తంగా

కాగితరామచంద్రాపురం వాసికి డాక్టరేట్



మౌనికారెడ్డి

నడిగూడెం : మండలంలోని కాగితరామచంద్రాపురం గ్రామానికి చెందిన అల్లుబెల్లి మౌనికారెడ్డి.. హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. డెవలప్‌మెంట్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ పాలిడ్ లిపిడ్ నానో ప్రాక్టికల్స్, ఎ మోడ్రన్ ఫార్ములేషన్ అప్రోచ్ ఇన్ డ్రగ్ డెలివరీ సిస్టమ్ అనే అంశంపై పరిశోధన చేసి సమర్పించినందుకు గాను చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రవీందర్, డీన్ శంకరయ్య, గైడ్ డాన్యుయేల్, ఆర్అండ్‌డీ డీన్ క్రిష్టోఫర్‌లు శుక్రవారం యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో మౌనికారెడ్డికి డాక్టరేట్ అందజేశారు. ఈ సందర్భంగా మౌనికారెడ్డిని కాగితరామచంద్రాపురం గ్రామపెద్దలు అభినందించారు.

కాంగ్రెస్ న్యాయ విభాగం కమిటీ అధ్యక్షుడిగా నవీన్



జక్కుల నవీన్‌కు నియామకపత్రం అందజేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హుజూర్‌నగర్ : కాంగ్రెస్ పార్టీ న్యాయ విభాగం కమిటీ నియోజకవర్గ అధ్యక్షుడిగా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన జక్కుల నవీన్ నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. తనను నియమించిన మంత్రి ఉత్తమ్‌కు, తన నియామకానికి సహకరించిన కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి తనవంతు న్యాయ పరమైన సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోదాడరూరల్ : మండలంలోని నల్లబండగూడెం, చిమిర్యాల, కాపుగల్లు గ్రామాల్లో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించనున్నందున ఆయా గ్రామాల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపియనున్నట్లు విద్యుత్ శాఖ రూరల్ ఏఈ ఎస్‌కె.సైదా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గృహ వినియోగదారులు, పరిశ్రమల నిర్వాహకులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

వృద్ధురాలికి వీల్‌చైర్ అందజేత



వీల్‌చైర్ అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మునగాల : మండలంలోని కృష్ణానగర్ గ్రామానికి చెందిన వృద్ధురాలు నూకబత్తిని లక్ష్మమ్మకు ఎమ్మెల్యే పద్మావతి శుక్రవారం కాంగ్రెస్ నాయకుల ద్వారా వీల్‌చైర్ అందచేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు సురగాని భద్రాజి, బేతం రామిరెడ్డి మాట్లాడుతూ పోషణ కరువైన వృద్ధ దంపతులు నూకబత్తిని భిక్షం - లక్ష్మమ్మలను గత నెల ఎమ్మెల్యే పరామర్శించి ఆదుకుంటామని ఇచ్చిన హామీ మేరకు లక్ష్మమ్మకు వీల్‌చైర్ కొనుగోలు చేసి పంపించినట్లు తెలిపారు. వీలైనంత త్వరలో భిక్షానికి వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన



మాధవరంలో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఏపీఓ శైలజ

మునగాల : మండలంలోని మాధవరం గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను ఏపీఓ శైలజ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడతూ.. రోజుకు రూ.300 కూలి పడేవిధంగా ఉపాధి హామీ పనులు చేయాలని సూచించారు. ఎండల దృష్ట్యా ఉపాధి కూలీలు జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీదేవి, ఉపాధి హామీ మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

కల్యాణ మండపం నిర్మాణానికి రూ.10,116 విరాళం

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయానికి అనుబంధంగా కల్యాణ మండపం నిర్మాణానికి నడిగూడెం మండల కేంద్రానికి చెందిన రాయికింది వెంకటేష్‌గౌడ్, కళ్యాణి దంపతులు శుక్రవారం నడిగూడెంలో ఆలయ కమిటీ సభ్యులకు రూ.10,116 విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వందనపు సూర్యప్రకాష్‌రావు, కొండా వెంకన్న గుప్త, తదితరులు పాల్గొన్నారు.

మట్టికుప్పలు ఇలా.. ప్రయాణించేదెలా

మునగాల : మండలంలోని జాతీయ రహదారి నుంచి మోతె మండల కేంద్రం వరకు డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా మండలంలోని విజయరాఘవపురం శివారులో బ్రిడ్జి నిర్మించారు. కానీ నెల రోజుల క్రితం బ్రిడ్జిపై మట్టి కుప్పలు పోసి చదును చేయకుండా వదలివేశారు. దీంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. బ్రిడ్జిపై మట్టి కుప్పలు ఉండడంతో ప్రజలు బ్రిడ్జి పక్కన ఏర్పాటు చేసిన అప్రోచ్ రహదారి గుండా వెళ్లాల్సి వస్తోంది. కానీ అప్రోచ్ రహదారి గుంతలమయంగా ఉండడంతో నిత్యం నరకం అనుభవిస్తున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్ స్పందించి బ్రిడ్జిపై పోసిన మట్టిని వెంటనే చదును చేసి రాకపోకలకు వీలు కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



విజయరాఘవపురం శివారులో బ్రిడ్జిపై పోసిన మట్టికుప్పలు

విద్యుత్ లైట్లు వెలగక ప్రమాదాలు

చిలుకూరు : కోదాడ- జడ్చర్ల జాతీయ రహదారిపై చిలుకూరు మండల కేంద్రంలో డివైడర్‌పై ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు వెలగడం లేదు. హైవే నిర్మించి దాదాపు ఐదారేళ్లు అయింది. నాటి నుంచి హైమాస్ట్ లైట్లు సరిగా వెలగడం లేదు. దీంతో రాత్రి వేళ మండల కేంద్రంలో రహదారి చీకటిమయంగా మారుతోంది. ద్విచక్రవాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. డివైడర్, రోడ్డు సక్రమంగా కనబడక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇటీవల వాహనాలు డివైడర్‌ను ఢీకొట్టి ప్రమాదాలు జరిగాయి. సమస్యపై హైవే అధికారులకు అనేక సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుత వేసవిలో మండల కేంద్రంలోని హైవేపై గేదెలు తిరుగుతుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జాతీయ రహదారిపై విద్యుత్ లైట్లు వెలిగేలా చూడాలని కోరుతున్నారు.



చిలుకూరులో హైవేపై వెలగని లైట్లు

నిధులు రాక.. పనులు నిలిచి

- నిలిచిన ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ పనులు
- నిధులు విడుదల చేసి పూర్తి చేయాలని గ్రామస్తుల వేడుకోలు



నిలిచిపోయిన పాఠశాల భవన నిర్మాణ పనులు

మునగాల : మండలంలోని కలకోవ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన నూతన భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. పాఠశాలలో పాత భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అదే ఆవరణలో రెండు గదులతో నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు గత ప్రభుత్వం రూ.18 లక్షలు కేటాయించింది. దీంతో కాంట్రాక్ట్ దక్కించుకున్న వ్యక్తి మూడేళ్ల క్రితం భవన నిర్మాణ పనులు ప్రారంభించాడు. ఇప్పటివరకు దాదాపు 90 శాతం పూర్తి చేశాడు. కానీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే నిలిపివేశాడు. దీంతో ఇంకా పదిశాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. గత రెండేళ్లుగా పాఠశాల భవనం నిరుపయోగంగా ఉంటోంది. ఈ పాఠశాలలో సుమారు 40 మంది విద్యార్థులు ఉండగా రెండు గదులతో పాటు చెట్ల కింద విద్యాబోధన చేస్తున్నారు. పాఠశాలలు పునః ప్రారంభంలోపు ప్రభుత్వం నిధులను విడుదల చేసి నిలిచిపోయిన భవనం నిర్మాణ పనులను పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి



గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనానికి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అర్ధాంతరంగా పనులు నిలిచిపోయాయి. రెండేళ్లుగా అసంపూర్తి భవనం నిరుపయోగంగా ఉంటుంది. సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలకు కేటాయించిన నిధులను తక్షణమే విడుదల చేయాలి. - పాతకొట్ల నాగరాజు, కలకోవ

చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని వినతి



చెరువు ఆక్రమణపై కలెక్టరేట్‌కు వెళ్లిన మత్స్యకారులు

నేరేడుచర్ల : మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామంలో గల చెరువును ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ గ్రామ మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు కోరారు. ఈమేరకు శుక్రవారం సూర్యాపేటలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ.. చెరువు చుట్టూ భూములు ఉన్న రైతులు సుమారు 70 ఎకరాల చెరువును పూడ్చి ఆక్రమించుకున్నారని తెలిపారు. చెరువును సర్వే చేసి ఆక్రమణకు గురైన భూమిని కాపాడాలని వారు కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు ఇంజమూరి వెంకటయ్య, సిరికొండ మట్టయ్య, యమగాని లచ్చయ్య, సిరికొండ నాగయ్య, యడవల్లి వెంకటకృష్ణ, సిద్దపంగ సోమయ్య, వలదాసు వేణు, యమగాని రాంబాబు, నరేష్, వెంకటరమణ, సురేష్, చంద్రయ్య, జానయ్య, సైదులు, రాంబాబు, హుస్సేన్, సాగర్ ఉన్నారు.

హజ్ యాత్రకు వెళ్లిన రఘునాథపాలెం ముస్లింలు



మక్కాకు బయలుదేరి వెళ్తున్న ముస్లింలు

మఠంపల్లి : మండలంలోని రఘునాథపాలెం నుంచి ముస్లింలు షేక్ నాగులు, షేక్ దస్తగిరి, షేక్ షరీఫ్, మరో ఇద్దరు మహిళలు శుక్రవారం హజ్ (మక్కా) యాత్రకు వెళ్లారు. ముందుగా స్థానిక మసీద్‌లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పెద్దమౌలానా అబ్దుల్‌ఖాదిర్ మాట్లాడుతూ.. అల్లా దయతో యాత్రను దిగ్విజయంగా పూర్తిచేసుకుని మక్కాలోని దువాలో రఘునాథపాలెం ప్రజల కోసం ప్రార్థనలు చేసి క్షేమంగా తిరిగిరావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మసీద్ కమిటీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ మండల నాయకులు పఠాన్ హఫీజ్‌ఖాన్, ఎస్‌కె సైదా, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం



ఉత్తరారెడ్డి, పద్మ దంపతులను సన్మానిస్తున్న భక్తులు

గరిడేపల్లి : ఆలయ అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని పలువురు భక్తులు అన్నారు. గరిడేపల్లి మండల కేంద్రంలోని గుండాలమ్మ తల్లి దేవాలయ అభివృద్ధికి గుండాల మెట్టకు చెందిన రాగిరెడ్డి ఉత్తరారెడ్డి, పద్మ దంపతుల కుమారుడు ప్రశాంత్‌రెడ్డి రూ. 50వేల విరాళాన్ని శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలన్నారు. అనంతరం ఉత్తరారెడ్డి, పద్మ దంపతులను అభినందించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

సరస్వతీ దేవికి అభిషేకం



కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : పిల్లలమర్రి శ్రీమహా దేవ నామేశ్వరస్వామి ఆలయం ఆవరణలోని శ్రీ సరస్వతీ దేవి సమేత బ్రహ్మ ఆలయంలో శుక్రవారం మూల నక్షత్రం, సంకటహర చతుర్థి సందర్భంగా అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు శ్రీ చక్ర దేవతకు కుంకుమ పూజ చేశారు. నీరాజన, మంత్రపుష్పం అనంతరం తీర్థప్రసాద వితరణ నిర్వహించారు. అర్చకులు పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేత

హుజూర్‌నగర్ : జూలై 9న నిర్వహించబోయే సమ్మె నోటీస్‌లను శుక్రవారం హుజూర్‌నగర్ రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు పి.లక్ష్మీనరసింహారావు, వర్తక సంఘం అసోసియేషన్ అధ్యక్షుడు అయ్యప్పలకు అందజేశారు. కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి, రైస్ మిల్ డ్రైవర్ యూనియన్ నాయకులు జి.వెంకన్న, స్వరూప, సుకన్య, కోటమ్మ, రామయ్య పాల్గొన్నారు.

సీతమ్మకు నివాళి

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో రిటైర్డ్ అంగన్‌వాడీ టీచర్ గువ్వల సీతమ్మ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మృతదేహాన్ని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్నగౌడ్ సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. నివాళులర్పించిన వారిలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శీలం శ్రీను, ఐఎన్‌టీయూసీ నియోజకవర్గ అధ్యక్షుడు గురువయ్య, నాగేశ్వరరావు, ఆంజనేయులు, నాగరాజు, హనుమంతు తదితరులు ఉన్నారు.

'జోగు పిచ్చిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి'

గరిడేపల్లి : మండలంలోని పానుగోడు గ్రామంలో గల చెరువులోకి దిగేందుకు జోగు పిచ్చిరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెట్లు నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జోగు పిచ్చిరెడ్డి ఫౌండేషన్ కార్యదర్శి జోగు అరవిందరెడ్డి మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ద్వారా గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. బతుకమ్మ ఉత్సవాల సందర్భంగా మహిళలు బతుకమ్మలను చెరువులో వదిలేందుకు ఇబ్బంది పడుతున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని జోగు పిచ్చిరెడ్డి ఫౌండేషన్ ద్వారా చెరువులోకి దిగేందుకు రూ. 1.20 లక్షల వ్యయంతో మెట్లు నిర్మిస్తున్నట్లు తెలిపారు.

నాలుగు గేదెలు మృతి

తాళ్లగడ్డ (సూర్యాపేట) : సూర్యాపేట మండల పరిధిలోని లక్ష్మీతండాలో శుక్రవారం విద్యుదాఘాతానికి గురై నాలుగు గేదెలు మృతి చెందాయి. లక్ష్మీతండా శివారు ప్రాంతంలో లోనావత్ బుల్లి, లోనావత్ నీలాకు చెందిన నాలుగు గేదెలు మేత మేస్తున్న క్రమంలో అక్కడే తెగిపడి ఉన్న విద్యుత్ తీగలు తగిలాయి. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి గేదెలు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. విద్యుత్ శాఖ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరుతున్నారు.

ఆలయానికి ఎకరం భూమి విరాళం

మునగాల : మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వర హనుమాన్ దేవాలయానికి గ్రామానికి చెందిన పెనుగొండ విశ్వనాథం జ్ఞాపకార్థం సతీమణి సీతారత్నం ఎకరం భూమి విరాళం ప్రకటించారు. కాగా సీతారత్నం తన మరణానంతరం సదరు భూమి దేవాలయానికి చెందే విధంగా వీలునామా రాసి ఇటీవల మృతి చెందింది. దీంతో పెనుగొండ విశ్వనాథం-సీతారత్నం దంపతుల వారసులు అల్లుళ్లు- కుమార్తెలు పబ్బిశెట్టి ప్రసాద్- ఉదయవీరలక్ష్మి, మంచాల మల్లీశ్వర్- హేమలత, వెంపటి కృష్ణ -కాత్యాయని, దార రవికిశోర్ -కళ్యాణి, వంగవేటి శ్రీధర్ -శ్యామలదేవి శుక్రవారం సదరు భూమిని దేవాలయం పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి సంబంధిత పత్రాలను గ్రామ పెద్దల సమక్షంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు తూముల వీరస్వామి, కమిటీ సభ్యులకు ఆలయం ఆవరణలో అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు నల్లపాటి శ్రీనివాస్, వంగవేటి గురుమూర్తి, పెనుగొండ దుర్గాప్రసాద్, చింతకాయల ఉపేందర్, వేట సైదారావు, దాసరి వెంకన్న, ఆలయ కమిటీ కార్యదర్శి గంధం అంజయ్య పాల్గొన్నారు.



ఆలయ కమిటీకి భూమి రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న దాత వారసులు

అన్యాయాలపై బీసీలు ఐక్యంగా పోరాడాలి

హుజూర్‌నగర్ : బీసీలకు జరుగుతున్న అన్యాయాలపై ఐక్యంగా పోరాడాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు దూళిపాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం హుజూర్‌నగర్ పట్టణంలోని 18వ వార్డులో ఆ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం వార్డు ఇన్‌చార్జ్‌గా ఎం.యుగంధర్‌చారిని నియమిస్తూ నియామకపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు బొడ్డు గోవిందరావు, పట్టణం మహిళా విభాగం అధ్యక్షురాలు గూడెపు దీప, సంఘం నాయకులు నరసింహాచారి, కె.వెంకటేశ్వరరావు, కె.శ్రీనివాస్ శెట్టి, శ్రీనివాస్, కె.కృష్ణ, కె.శేఖర్, ఆర్.శ్రీనివాసచారి, ఎ.గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలి

మునగాల : ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రేపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ బి.వినయ్‌కుమార్ కోరారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా రేపాలలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. డెంగీ నివారించండి, నీటి నిల్వలను పరిశీలించండి, పరిశుభ్రత పాటించండి అనే నినాదంతో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఆరోగ్య విస్తరణాధికారి భాస్కర్‌రాజు మాట్లాడుతూ.. ప్రతి మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బి.జయమ్మ, ఏఎన్ఎంలు పద్మ, ఆశాలు జ్యోతి, రమణ, నర్సింగ్ అధికారి సునీత, ఫార్మసిస్ట్ శాంతయ్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : గోవిందపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి వేణుగోపాల్, సిబ్బంది



మునగాల : రేపాలలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

గోవిందపురంలో అవగాహన ర్యాలీ

హుజూర్‌నగర్ : ప్రతిఒక్కరూ దోమల వృద్ధిని అరికట్టేందుకు సహకరించాలని మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌నాయక్ అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని గోవిందపురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పగలు కుట్టే దోమలు ప్రమాదకరమని, వాటితోనే డెంగీ జ్వరం వస్తుందని తెలిపారు. ఏడిస్ రకానికి చెందిన ఆడ దోమల ద్వారా డెంగీ వ్యాపిస్తుందని ఆయన తెలిపారు. దోమలను అరికట్టేందుకు డ్రైడే పాటించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పద్మ, పీహెచ్ఎన్ నూర్జహాన్ బేగం, హెల్త్ అసిస్టెంట్లు ఇందిరాల రామకృష్ణ, యు.శ్రీనివాస్, ప్రశాంతి, ఎల్‌టీ రమేష్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు కృషి చేయాలి

గరిడేపల్లి : డెంగీ నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని మండల వైద్యాధికారి నరేష్ అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దోమల ద్వారా డెంగీ, మలేరియా, చికెన్ గున్యా, ఫైలేరియా వ్యాధులు వ్యాపిస్తాయని తెలిపారు. అందుకే దోమలు పుట్టకుండా, కుట్టకుండా చూసుకోవాలని కోరారు. ప్రధానంగా ఇంటి పరిసరాల్లో మురికినీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని తెలిపారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో త్రిపురం అంజన్‌రెడ్డి, సబ్ యూనిట్ అధికారి ఎ.రామకృష్ణ, సీహెచ్ఎస్ శారద, సూపర్‌వైజర్ అంజయ్యగౌడ్, వెంకటరమణ, శ్రీనివాస్, ఉపేందర్, ఏఎన్ఎంలు సరస్వతి, కవిత, అంజలి, విజయ, సైదమ్మ, బాలకృష్ణ, ఆశా కార్యకర్తలు ఉమ, సైదమ్మ, అంజమ్మ, ఉపేంద్ర, కోటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



గరిడేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

భవనాన్ని కూల్చివేయాలి



శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనం

మునగాల : మండలంలోని కలకోవలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. దీంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. భవనం శిథిలావస్థకు చేరడంతో గత రెండేళ్లుగా ఈ భవనంలో ఉపాధ్యాయులు పిల్లలకు పాఠాలు బోధించడం లేదు. ఇదే ఆవరణలో నూతన పాఠశాల భవనం నిర్మించినప్పటికీ ఈ పాఠశాల భవనాన్ని తొలగించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శిథిలావస్థలో ఉన్న భవనాన్ని కూల్చివేయాలని గ్రామ ప్రజలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరుతున్నారు.

వీరన్న ఆశయ సాధనకు కృషి చేయాలి

సూర్యాపేట అర్బన్ : మారోజు వీరన్న ఆశయ సాధనకు కృషి చేయాలని సీపీఐ(ఆర్ఎం) రాష్ట్ర కార్యదర్శి చామకూరి నరసయ్య అన్నారు. శుక్రవారం బహుజన సిద్ధాంతకర్త మారోజు వీరన్న 26వ వర్ధంతిని పట్టణంలోని 60 ఫీట్ల రోడ్డులో ఉన్న భీంరెడ్డి నరసింహారెడ్డి విగ్రహం వద్ద మారోజు వీరన్న స్మారక కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సామాజిక అసమానతలు లేని మానవ ప్రపంచాన్ని నిర్మించడమే మనం ఆయనకు ఇచ్చే ఘనమైన నివాళి అన్నారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ రామచంద్రన్ వర్గం అధికార ప్రతినిధి బుద్ధ సత్యనారాయణ, ఎంసీపీఐ (యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న, ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు, నాయకులు వెంకన్న, రాములు, సోమయ్య పాల్గొన్నారు.

ముమ్మరంగా బేతవోలు రోడ్డు పనులు



బేతవోలు డబుల్ రోడ్డు నిర్మాణంలో భాగంగా పరిచిన కంకర

చిలుకూరు : మండలంలో బేతవోలు డబుల్ రోడ్డు నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం కంకర పరిచే పనులు చేపడుతున్నారు. తొమ్మిది నెలల క్రితం పనులు ప్రారంభించగా ప్రస్తుతం 90 శాతం మేర పూర్తయ్యాయి. మరో నెల రోజుల్లో పూర్తి కానున్నాయి. చిలుకూరులోని బేతవోలు క్రాస్ రోడ్డు నుంచి బేతవోలు వరకు 8 కిలోమీటర్ల రోడ్డుకు ఆర్అండ్‌బీ నిధుల నుంచి రూ. 16 కోట్లు మంజూరయ్యాయి. బీటీతో పాటు రోడ్డుకు ఇరుపక్కల 3 మీటర్లు మట్టి రోడ్డుతో కలిపి మొత్తం 10 మీటర్లు వెడల్పుగా ఈ రోడ్డు మారుతోంది. రోడ్డు పరిధిలో 15 కల్వర్టులు నిర్మించారు. ఈ మార్గంలో ఉన్న ముక్త్యాల కాలువ వద్ద రోడ్డు యాధావిధిగా ఉంటుంది. అయితే ఈ రోడ్డులో బేతవోలు, జెర్రిపోతులగూడెం, ఆచార్యులగూడెం, చెన్నారిగూడెం, పోలేనిగూడెం, కొండాపురం, మాధవగూడెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు వివిధ పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతంలో వరి సాగు కూడా ఎక్కువగా ఉండడంతో లారీలు, భారీ వాహనాలతో రద్దీగా ఉంటుంది. రోడ్డు నిర్మాణం పూర్తయితే వాహనదారులకు ఇన్నాళ్లు పడిన ఇబ్బందులు తొలగుతాయి.

ధాన్యాన్ని మిల్లులకు తరలించాలి

- అదనపు కలెక్టర్ రాంబాబు



కొనుగోళ్లు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

తాళ్లగడ్డ (సూర్యాపేట) : కాంటాలను వేగవంతంగా పూర్తి చేసి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అదనపు కలెక్టర్ రాంబాబు అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాయినిగూడెం -2, ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలెంల-2, పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యర్కారం, పిల్లలమర్రి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో సుమారుగా 90 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన ధాన్యాన్ని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. లారీలను సర్దుబాటు చేసి కొనుగోలు కేంద్రాలకు పంపిస్తామని, అకాల వర్షాలకు వడ్లు తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకొని మూడు రోజులలో కాంటాలు వేసి ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని సూచించారు. ఇప్పటివరకు రాయినిగూడెం -2 కొనుగోలు కేంద్రం నుంచి 6220 క్వింటాలు, ఐకేపీ బాలెంల -2 నుంచి 17000 క్వింటాలు, పీఏసీఎస్ పిల్లలమర్రి నుంచి 13,333 క్వింటాలు, యర్కారం నుంచి 17000 క్వింటాల ధాన్యం మిల్లులకు తరలించినట్లు సంబంధిత నిర్వాహకులు అదనపు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ఆయన తిరుమలగిరి మండలంలోని ఏఎస్ఆర్ రైస్ మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన ధాన్యాన్ని లారీల నుంచి వెంటనే దిగుమతి చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో పీడీ మెప్మా ఇన్‌చార్జ్ కాసం రేణుక, తహసీల్దార్లు శ్యామ్ సుందర్ రెడ్డి, శ్రీనివాస్, సెంటర్ ఇన్‌చార్జ్‌లు ఫణీమా, పుష్పలత, వెంకటరెడ్డి, సంఘం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇటు ఆహ్లాదం.. అటు వృక్ష సంహారం

హుజూర్‌నగర్ : పర్యావరణ పరిరక్షణ కోసం హరితహారంలో భాగంగా రోడ్ల వెంట నాటిన మొక్కలు పలు చోట్ల వృక్షాలుగా మారి బాటసారులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మరి కొన్ని చోట్ల ఏపుగా పెరిగిన చెట్లను నరికివేస్తుండడంతో మొద్దులే దర్శనమిస్తున్నాయి. అయినా చెట్ల నరికివేతపై సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. హుజూర్‌నగర్ నుంచి వేపలసింగారం వెళ్లే రోడ్డు వెంట ఓ వైపు చెట్లు పచ్చదనాన్ని పంచుతుంటే, రోడ్డుకు మరోవైపు చెట్లను నరికివేయడంతో మోడుగా మారాయి. కొట్టివేసిన చెట్ల స్థానంలో కొత్తగా మొక్కలు నాటాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.



వేపలసింగారం రోడ్డులో పచ్చదనాన్ని పంచుతున్న వృక్షాలు



రోడ్డుకు ఓ వైపు మోడుగా మిగిలిన చెట్ల మొదళ్లు